www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 4 సెప్టెంబర్ 2023

5

ఏలూరు



సౌకర్యాల మెరుగుకు కృషి

టిటిడి సభ్యులుగా శేషబాబు ప్రమాణస్వీకారం

పాలకొల్లు : టిటిడి సభ్యులుగా మేకా శేషబాబు ఆదివారం తిరుమల శ్రీవారి సన్నిధిలో ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ యాత్రికుల మనోభావాలకు అనుగుణంగా తిరుమలలో సౌకర్యాల మెరుగుదలకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. టిటిడి కళ్యాణ మండపాల నిర్మాణం, నిర్వహణ మెరుగుదలకు కృషి చేస్తానని చెప్పారు. శేషబాబు తల్లిదండ్రులు, మేకా కోటేశ్వరరావు, సోదరుడు, ఆగ్రు సొసైటీ అధ్యక్షులు మేకా రామకృష్ణ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. టిటిడి సభ్యులుగా ఆదివారం ప్రమాణస్వీకారం చేసిన మేకా శేషబాబు టిటిడి ఛైర్మన్ కరుణాకర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పాలకొల్లు మండలం దగ్గులూరులో తయారవుతున్న కాడెద్దులతో ధాన్యం తోలుకెళ్తున్న రైతు టేకుతో తయారైన బొమ్మను బహుమతిగా అందజేశారు.

15 స్థానాలూ గెలిపిస్తే.. అభివృద్ధి చేసి చూపిస్తా

సొంతూరుకు రోడ్డు వేసుకోలేని ఎంఎల్ఎ వాసుబాబు

జిఒ 79 రద్దు చేసి పోలీసుల అలవెన్స్ పునరుద్ధరిస్తాం

గణపవరం సభలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్



గణపవరం సభలో మాట్లాడుతున్న లోకేష్

ప్రజాశక్తి - భీమవరం

రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో టిడిపిని గెలిపించాలని, అప్పుడు అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తానని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కోరారు. జిల్లాలో మంత్రులు, ఎంఎల్ఎలు ఉన్నప్పటికీ అభివృద్ధి ఆమడ దూరంలో ఉందని, రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపు ఖాయమని చెప్పారు. నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 203వ రోజు ఏలూరు జిల్లా ఉంగుటూరు నియోజకవర్గం నిడమర్రు మండలం చిననిండ్రకొలను నుంచి ఆదివారం ఉదయం ప్రారంభమైంది. పెద్దనిండ్రకొలను, నిడమర్రు, మందలపర్రు, భువనపల్లి మీదుగా గణపవరం చేరుకుంది. అక్కడ శేషమహల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడారు. ఇసుక, సిమెంట్, ఐరన్ ధరలు తగ్గించి భవన నిర్మాణ కార్మికులను ఆదుకుంటామన్నారు. మద్యపానం నిషేధం వంటి అనేక హామీలు ఇచ్చి మహిళలను జగన్ మోసం చేశారన్నారు. టిడిపి అధికారంలోకొస్తే అమలు చేసే పథకాలను వివరించారు. ఆక్వా, వరిసాగు క్రాప్ హాలిడేలతో సంక్షోభంలో ఉన్నాయన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీకి ఉద్యోగులకు జీతభత్యాలు అందించి అందరికీ ఆమోదయోగ్యమయ్యే ఫిట్‌మెంట్ అందిస్తామన్నారు. జిఒ 79ని రద్దు చేసి పోలీసుల అలవెన్స్ పునరుద్ధరిస్తామన్నారు. ఆక్వా రైతులకు పెట్టుబడి తగ్గించి గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. ఆక్వా జోన్‌లతో సంబంధం లేకుండా రూ.1.50 పైసలుకే యూనిట్ విద్యుత్ అందిస్తామన్నారు. ముఖ్యమంత్రి జగన్ జిల్లా పర్యటనలో భాగంగా ఉంగుటూరు వచ్చిన సందర్భంలో అనేక హామీలు ఇచ్చారని, అవన్నీ ఏమయ్యాయని ప్రశ్నించారు. కొల్లేరుపై రెగ్యులేటర్ల నిర్మాణం, సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ నిర్మాణం, కొల్లేరులో తాగునీటి సమస్య పరిష్కారం , ఏలూరు కాల్వపై వంతెనల నిర్మాణం వంటి హామీలన్నీ ఏమయ్యాయని ప్రశ్నించారు.



వృద్ధురాలితో మాట్లాడుతున్న లోకేష్

సొంత ఊర్లో రోడ్డు వేసుకోలేని అసమర్థుడు ఎంఎల్ఎ వాసుబాబు

నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో నలుగురు బినామీలను పెట్టి ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు ప్రజలను దోచేస్తున్నారని లోకేష్ ఆరోపించారు. వాసుబాబు బంధువు షాడో ఎంఎల్ఎగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎంఎల్ఎ సొంతూరులో సొంత రోడ్డు వేసుకోలేని అసమర్థుడని తీవ్రంగా విమర్శించారు. ఎంఎల్ఎ ఊరిలో సురక్షిత తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు.

గుంతలు తప్ప రోడ్డు ఎక్కడుంది జగన్

నిడమర్రు (గణపవరం): 'ఇది ప్రధాన రహదారి. ఇక్కడ గుంతలు తప్ప రోడుడ ఎక్కడుండి జగన్' అంటూ టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఎద్దేవా చేశారు. నిడమర్రు మండల కేంద్రానికి వచ్చే ప్రధాన రహదారి అధ్వానంగా ఉండటంపై లోకేష్ విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి జగన్ మాటలు కోటలు దాటుతాయిగాని, పనులు మాత్రం గజం కూడా ముందుకు సాగవని విమర్శించారు. అధికారంలో వచ్చి 51 నెలలైనా డేట్లు మారుతున్నాయి తప్ప రాష్ట్రంలో రోడ్ల ఫేట్ మారడం లేదన్నారు. కాంట్రాక్టర్లకు రూ.1.30 లక్షల కోట్ల బిల్లులు బకాయిలు పెట్టడంతో ఎన్నిసార్లు టెండర్లు పిలిచినా జగన్ ముఖం చూసి టెండర్లు వేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదన్నారు.

ఆక్వా రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న లోకేష్

చిననిండ్రకొలను నుంచి వస్తుండగా మార్గమధ్యంలో ఆక్వా రైతులను లోకేష్ పలుకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చేపల రైతు అప్పారావు మాట్లాడుతూ 15 ఏళ్లుగా తాను చేపలు సాగు చేస్తున్నానని, జగన్ అధికారంలోకొచ్చాక సీడ్, ఫీడ్, విద్యుత్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్లుగా సరైన ధర లేక ప్రతియేటా రెండు నుంచి మూడు లక్షల వరకూ నష్టం వాటిల్లుతుందని వాపోయారు. గత ప్రభుత్వ హయాంలో రూ.లక్ష కడితే ట్రాన్స్‌ఫార్మర్ ఇచ్చేవారని, ఇప్పుడు మూడు లక్షలుపైనే కట్టాల్సి వస్తోందని తెలిపారు. ఆక్వా రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, అవసరమైన మేర కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేస్తే మేలు జరుగుతుందని అప్పారావు వివరించారు. దీనిపై లోకేష్ మాట్లాడుతూ టిడిపి హయాంలో ఆక్వా రంగాన్ని పెద్దఎత్తున ప్రోత్సహించామని, ఆక్వా ఎగుమతుల్లో ఎపిని నెంబర్ వన్‌గా నిలబెట్టామని చెప్పారు. జగన్ పాలనలో ఆక్వా హాలిడే చూస్తున్నామని విమర్శించారు. ఆక్వా రంగానికి రూ.1.50కే యూనిట్ విద్యుత్ అందిస్తామని చెప్పి రైతులను జగన్ నిలువుగా మోసగించారన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆక్వా రంగాన్ని ఆదుకుంటామన్నారు.

పెదనిండ్రకొలనులో కాపు సామాజిక తరగతికి చెందిన వారు లోకేష్‌కు వినతిపత్రం సమర్పించారు. కాపులకు ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కాపు కార్పొరేషన్ ద్వారా రుణాలు పునరుద్ధరించాలని కోరారు. దీనిపై లోకేష్ మాట్లాడుతూ కాపు కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి ఆర్థిక స్వావలంబనకు కృషి చేస్తామని, కాపు రిజర్వేషన్లకు సంబంధించి సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. నిడమర్రులో పలువురు వినతిపత్రాలు అందించారు. నిడమర్రు పోలీస్ స్టేషన్ నుండి అడవికొలను వెళ్లే ఆర్అండ్‌బి రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. దీనిపై లోకేష్ స్పందిస్తూ జగన్ ప్రభుత్వ నిర్వాకం కారణంగా గ్రామాల్లో కనీసం బ్లీచింగ్ చల్లడానికి నిధుల్లేని దుస్థితి నెలకొందన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక వాటర్ గ్రిడ్ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తామని, పాడైపోయిన రోడ్లన్నింటినీ పునర్నిర్మిస్తామని హామీ ఇచ్చారు



ఘర్షణలో ధ్వంసమైన కారు

మందలపర్రులో ఉద్రిక్తత

టిడిపి, వైసిపి పరస్పర రాళ్ల దాడి

వైసిపి కవ్వింపు చర్యల ఫలితం

ఏలూరు జిల్లా తెలుగు యువత నేత రెడ్డి చందు కారు ధ్వంసం

ప్రజాశక్తి - భీమవరం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర సందర్భంగా ఏలూరు జిల్లా నిడమర్రు మండలం మందలపర్రులో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. పాదయాత్ర వెళ్లే మార్గంలో అడ్డుగా వైసిపి శ్రేణులు కొందరు ద్విచక్ర వాహనాలను అడ్డుపెట్టి, జెండాలు చూపుతూ కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో వైసిపి, టిడిపి శ్రేణుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఇరువురు పరస్పర దాడికి దిగి రాళ్లు రువ్వుకున్నారు. సుమారు 15 నిమిషాలపాటు మందలపర్రు రణరంగంగా మారింది. పోలీసులు జోక్యం చేసుకుని ఇరుపక్షాలను సముదాయించే ప్రయత్నం చేసినప్పటికీ పరిస్థితి అదుపులోకి రాలేదు. వైసిపి కార్యకర్తలు జెండాలను ఊపుతూ జై జగన్ అంటూ నినాదాలు చేశారు. దీంతో టిడిపి, వైసిపి శ్రేణులు పరస్పరం దూషించుకుంటూ పిడి గుద్దులు గుద్దుకుంటూ రెచ్చిపోయారు. ఈ నేపథ్యంలో పోలీస్ బలగాలు పెద్దసంఖ్యలో చేరుకుని ఇరుపక్షాలను చెదరగొట్టడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ప్రస్తుతం మందలపర్రు పోలీసు పహారాలో ఉంది. ఈ ఘర్షణలో ఇరుపక్షాలకు చెందిన కొంతమందికి గాయాలయ్యాయి. ఈ క్రమంలో తెలుగు యువత ఏలూరు జిల్లా అధ్యక్షుడు రెడ్డి చందు కారును వైసిపి శ్రేణులు ధ్వంసం చేశాయి. ఈ క్రమంలో తీవ్ర ఉద్రిక్తత నడుమ నారా లోకేష్ యువగళం పాదయాత్ర ముందుకు సాగింది.

సిపిఎం ఆధ్వర్యాన సంతకాల సేకరణ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

సిపిఎం సమరభేరిలో భాగంగా స్థానిక చేపలపేట వీధిలో కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రచారం చేస్తూ సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు మాట్లాడుతూ వర్షం కురిస్తే ఈ రోడ్డులో నడవ లేని పరిస్థితి ఉందని, రోడ్లపై నీరు నిలిచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వెంటనే డ్రెయినేజీ, రోడ్డు సమస్యలను పరిష్కరించాలని కోరారు. పరింపూడి ఎస్‌సి పేట వాసులు సైతం డ్రెయినేజీలు లేక నానావస్థలు పడుతున్నామని వాపోయారు. కార్యక్రమంలో ఆకుల వెంకటలక్ష్మి, గుర్రాణ లక్ష్మి, ఎ.సూర్యనారాయణమ్మ, జక్కు వెంకటలక్ష్మి, మార్పోయిన వెంకటలక్ష్మి, సుబ్బారావమ్మ, కుంచే సిద్ధమ్మ, ఎ.అరుణ, కోనాల లక్ష్మి పాల్గొన్నారు.

నిడమర్రు: అధిక ధరలు తగ్గించాలని సిపిఎం సమరభేరిలో భాగంగా ఆదివారం నిడమర్రులో కరపత్రాలు పంచుతూ సంతకాల సేకరణ నిర్వహించారు. కార్యక్రమంలో నారపల్లి రమణరావు, కోన శ్రీనివాసరావు, గవర సత్యనారాయణ, వెలగలేటి మోహన్ పాల్గొన్నారు.



నిడమర్రులో..

విజయలక్ష్మికి ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు



ముసునూరు: మండలంలోని కాట్రేనిపాడు పంచాయతీలోని హరిచంద్రపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని తూమాటి విజయలక్ష్మికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు రావడం సంతోషకర విషయమని ఎంఇఒ బివి.సుబ్బారావు అన్నారు. గోపవరం గ్రామానికి చెందిన తూమాటి విజయలక్ష్మి 2019లో హరిచంద్రపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయినిగా నియమితులయ్యారు. నో కాస్ట్.. లో కాస్ట్ బోధన సామగ్రిని ఉపయోగిస్తూ విద్యార్థులు సులువుగా నేర్చుకునే మార్గాలను అన్వేషిస్తూ విజయలక్ష్మి ముందుకు సాగుతున్నారు. విద్యారంగంలో ఆమె సేవలను గుర్తిస్తూ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా అధికారులు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, విజయలక్ష్మిని అభినందించారు.

అవార్డుకు ఎంపికైన విజయలక్ష్మి మాట్లాడుతూ ఈ అవార్డు రావడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. దీనితో తనపై మరింత బాధ్యత పెరిగిందని, విద్యార్థుల అభివృద్ధికి అవసరమైన విధంగా మరింత మెరుగైన విద్యాబోధనకు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

ఉపాధి కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

రౌండ్‌టేబుల్ సమావేశంలో ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

దేశంలో యువతకు ఉపాధి కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ విమర్శించారు. ఆదివారం సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షతన 'దేశంలో నిరుద్యోగ సమస్య– కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి' అనే అంశంపై అఖిలపక్ష రాజకీయ పార్టీలు, విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథి సాబ్జీ మాట్లాడుతూ మోడీ సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని ఇచ్చిన హామీ అమలు చేయలేదని విమర్శించారు. రైల్వే, టెలికాం, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ తదితర ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేట్, కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడం వల్ల దేశంలో కోట్ల సంఖ్యలో పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. రైల్వేలో కనీసం గ్యాంగ్‌మెన్ ఉద్యోగాలు భర్తీ చేయకపోవడమే ఒడిశా బాలసోర్లో రైల్వే ప్రమాదానికి కారణమని అన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా 2.46 లక్షల ఖాళీ పోస్టులు ఉన్నాయని తెలిపిందని, అయితే వాటిని భర్తీ చేయడం లేదని విమర్శించారు. ప్రతియేటా మెగా డిఎస్‌సి ప్రకటిస్తామన్న ముఖ్యమంత్రి జగన్ తన పరిపాలనా కాలంలో ఒక్క డిఎస్‌సి కూడా ప్రకటించలేదని, రాష్ట్ర చరిత్రలో ఇదొక రికార్డు అని వ్యంగ్యంగా విమర్శించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ నిరుద్యోగం, అధిక ధరలు, కరెంటు ఛార్జీలు వంటి మూడు ప్రధాన సమస్యలపై సిపిఎం దేశవ్యాప్తంగా సమరభేరి ఆందోళనలు చేపట్టిందని తెలిపారు. దేశంలో యువతకు ఉపాధి కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. ఈ దేశాభివృద్ధికి పాటుపడుతున్న వ్యవసాయ రంగం, అసంఘటిత రంగంలో కూడా కోట్లాది మంది ప్రజలు రోజువారీ పనుల కోసం పడిగాపులు పడుతున్నారని తెలిపారు. జిల్లాలోని ఏలూరు జ్యూట్‌మిల్లు, భీమడోలు సుగర్ ఫ్యాక్టరీలు మూసివేసిన సంగతి గుర్తు చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఉపాధి చూపకపోవడం వల్ల దేశంలో తీవ్ర ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి తోడు నిత్యావసర సరుకుల ధరలు ప్రజలను మరింత కుంగదీస్తున్నాయని అన్నారు. పోలవరం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించినా కేంద్ర ప్రభుత్వం నిధులు మాత్రం ఇవ్వడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కె.రాజనాలరామ్మోహన్‌రావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఉపాధి చూపించడంలో విఫలమయ్యాయన్నారు. డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము మాట్లాడుతూ యువత అంతా పకోడీలు వేసుకుని బతకాలని బిజెపి నేతలు చులకనగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వాలు ఉపాధి కల్పించకపోవడంతో ఇంజినీరింగ్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివిన యువత అంతా నేడు జొమాటో, స్విగ్గీ వంటి పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేసుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న ఎనిమిది కోట్ల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆమ్ఆద్మీ ఏలూరు అధ్యక్షుడు షేక్ మస్తాన్ మాట్లాడుతూ కేంద్రంలో రెండు దపాలు గా పరిపాలన సాగిస్తున్న బిజెపి ధరలను అదుపు చేయడంలో ఉపాధి కల్పించడంలో ఘోరంగా విఫలమైందన్నారు. భారత్ బచావో జిల్లా అధ్యక్షులు గుబ్బల నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో యువత అందరికీ పనులు కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే అని అన్నారు. బిజెపి అధికారంలో ఉన్నంతకాలం యువతకు ఉపాధి దొరకదని విమర్శించారు. సిఐటి యు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో నోట్ల రద్దు, కరోనా సమయంలో కంటే నేడు నిరుద్యోగం పదింతలు పెరిగిందని అన్నారు. దీనికి కారణం మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే కారణమన్నారు. సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి సూర్యకిరణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, పిడిఎస్‌యు నగర కార్యదర్శి క్రాంతి, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, చేతివృత్తిదారుల జిల్లా కన్వీనర్ పి.ఆదిశేషు మాట్లాడారు.



మాట్లాడుతున్న ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

హర్యానా ఆశాలకు సంఘీభావంగా 5న ఆందోళనలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

హర్యానాలో ఆశా వర్కర్లు ఆగస్టు 8వ తేదీ నుండి చేపట్టిన నిరవధిక సమ్మెను పరిష్కరించేందుకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలని కోరుతూ ఈ నెల 5న ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు కె.పోశమ్మ తెలిపారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో కమల అధ్యక్షతన జరిగిన జిల్లా సమావేశంలో ఆమె మాట్లాడారు. హర్యానా రాష్ట్రంలో ఆశా వర్కర్లు న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని గత 25 రోజులుగా సమ్మె చేస్తున్నా అక్కడి రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఆగస్టు 27న శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్లు, సిఐటియు నాయకులపై దారుణంగా లాఠీఛార్జీ జరిపి అక్రమంగా అరెస్టు చేశారన్నారు. మహిళలైన ఆశా వర్కర్లు పట్ల హర్యానా పోలీసులు అమానుషంగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్ట్ చేసిన ఆశా వర్కర్లకు కనీసం తాగునీరు ఇవ్వకుండా, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించకుండా హింసించారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా హర్యానా రాష్ట్ర ముఖ్యమంత్రి తక్షణమే జోక్యం చేసుకుని ఆశా వర్కర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించేందుకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రికి రాష్ట్రవ్యాప్తంగా ఆశా వర్కర్లు మెయిల్ ద్వారా వినతిపత్రాలు పంపిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు రోజా, నాగమణి, కామేశ్వరి, మేరీ, దేవి, పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు చేయూత

జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పి.ఏసుదాసు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



కొత్తగా పరిశ్రమలు స్థాపించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనుకునే వారికి జిల్లా పరిశ్రమల కేంద్రం అన్ని రకాలుగా చేయూతను అందిస్తుందని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పి.ఏసుదాసు తెలిపారు. పరిశ్రమల స్థాపనకు ఎలా దరఖాస్తు చేసుకోవాలి, ప్రభుత్వం ఎలాంటి సబ్సిడీ ఇస్తుంది, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఎలాంటి అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు వంటి పలు ప్రశ్నలకు ప్రజాశక్తి ముఖాముఖిలో ఆయన సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న: జిల్లా పరిశ్రమల కేంద్రం ముఖ్య లక్ష్యం ఏమిటి?

కొత్త పరిశ్రమల స్థాపన, పరిశ్రమల స్థాపన ద్వారా యువతను ఆదాయ మార్గం వైపు నడిపించి మరికొంతమందికి ఉపాధి చూపించేలా యువతకు ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా అవగాహన కల్పించడం, పరిశ్రమలు స్థాపించే వారికి సబ్సిడీ అందించడం ఈ సంస్థ ముఖ్య లక్ష్యం.



ప్రశ్న: ఔత్సాహిక పారిశ్రామికవేత్తకు కావాల్సిన ముఖ్య లక్షణాలు ఏమిటి?

కస్టమర్ రిలేషన్స్, నాణ్యతా ప్రమాణాలు పాటించడం వంటి మంచి వ్యాపార లక్షణాలు, నిర్ణీత స్థాయిలో రిస్కు తీసుకోవడం, సరైన నిర్ణయం వేగంగా తీసుకోవడం, సహనం కలిగి ఉండటం, మంచి ప్రణాళిక నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు, కార్మికుల సంక్షేమం కోరుకోవడం వంటి లక్షణాలు ఉండాలి.

ప్రశ్న: పరిశ్రమల స్థాపనలో అవసరమైన ముఖ్యమైన అంశాలేవి?

ఉత్పత్తులు, సర్వీసులు ఎంపిక చేసుకోవడం, మార్కెట్ సర్వే చేయటం, ప్రాజెక్టు రిపోర్ట్ తయారు చేయటం, వివిధ ప్రభుత్వ శాఖల అనుమతుల కోసం దరఖాస్తు చేయటం, ఆర్థిక సహాయం, సబ్సిడీ కోసం దరఖాస్తు చేయటం, పరిశ్రమకు అవసరమైన భవన నిర్మాణం, యంత్ర పరికరాల కొనుగోలు, స్థాపన, అవసరమైన లైసెన్సుల కోసం దరఖాస్తు వంటివి చాలా ముఖ్యమైనవి.

ప్రశ్న: ఎలాంటి ఉత్పత్తి లేదా సర్వీసుల ఎంపిక వల్ల స్థాపించిన పరిశ్రమలు లాభదాయకంగా ఉంటాయి?

ప్రస్తుతం వినియోగదారులకు అవసరమై అందుబాటులో లేనివి, మార్కెట్లో డిమాండ్‌కు తగ్గ సరఫరా లేనివి, ప్రస్తుత ప్రజల జీవన సరళి, అవసరాలకు తగిన ఉత్పత్తులు లేదా సర్వీసులు ఎంపిక చేసుకోవడం ద్వారా స్థాపించిన పరిశ్రమలు లాభదాయకంగా ఉంటాయి.

ప్రశ్న: ప్రధానమంత్రి ఉపాధి కల్పనా పథకంలో పరిశ్రమలు స్థాపించడానికి ఎవరెవరు అర్హులు?

18 సంవత్సరాలు పైన వయస్సు ఉన్నవాళ్లు, స్వయం సహాయక సంఘాలు, సహకార సంఘాలు, ఛారిటీ ట్రస్టులు పరిశ్రమలు స్థాపించొచ్చు.

ప్రశ్న: ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ వీరికి ఎలా ఉంటుంది?

జనరల్ కేటగిరీలో పట్టణ ప్రాంతాల్లో 15 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 25 శాతం సబ్సిడీ ఉంటుంది. అలాగే లబ్ధిదారుడు 10 శాతం పెట్టుబడి పెట్టాలి. మిగిలింది బ్యాంకు రుణం తీసుకోవచ్చు. అలాగే ప్రత్యేక కేటగిరీలైన బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ, మాజీ సైనికులకు పట్టణ ప్రాంతాల్లో 25 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 35 శాతం సబ్సిడీ ఉంటుంది. లబ్ధిదారుడు ఐదు శాతం పెట్టుబడి పెట్టాలి.

ప్రశ్న: పెట్టుబడిని బట్టి పరిశ్రమలు ఇన్ని రకాలుగా ఉంటాయి? ఎంత పెట్టుబడి అవసరం అవుతుంది, వార్షిక టర్నోవర్ ఎంత?

ఒక కోటి రూపాయల్లోపు ఉన్న పరిశ్రమలను మైక్రో ఎంటర్‌ప్రైజెస్ అంటారు. వార్షిక టర్నోవర్ రూ.5 కోట్ల వరకు ఉండొచ్చు. అలాగే ఒక కోటి నుంచి పది కోట్ల వరకు పెట్టుబడి ఉన్న పరిశ్రమలను స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ అంటారు. రూ.50 కోట్ల వరకు వార్షిక టర్నోవర్ ఉండొచ్చు. అలాగే రూ.10 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు పెట్టుబడి ఉన్న పరిశ్రమలను మీడియం ఎంటర్‌ప్రైజెస్ అంటారు. వార్షిక టర్నోవర్ రూ.250 కోట్ల వరకు ఉండొచ్చు. రూ.50 కోట్లు పెట్టుబడి దాటితే రాష్ట్ర స్థాయి నుంచి అనుమతులు తెచ్చుకోవాల్సి ఉంటుంది. జిల్లా పరిశ్రమల కేంద్రం నుంచి అనుమతులు ఇవ్వరు.

ప్రశ్న: పరిశ్రమల స్థాపనకు ఎలా దరఖాస్తు చేసుకోవాలి? అనుమతులు ఎలా వస్తాయి, ఎన్ని రోజుల్లో వస్తాయి?

పరిశ్రమ స్థాపించాలంటే ముందుగా పరిశ్రమల శాఖకు సంబంధించిన సింగిల్ డెస్క్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అవసరమైన అన్ని డాక్యుమెంట్లు పరిశీలించి 21 రోజుల్లో అప్రూవల్ చేస్తారు. అక్కడి నుంచి స్థలం ఎంపిక చేసుకుని, భవనం నిర్మించి, యంత్ర పరికరాలు తెచ్చుకుని యూనిట్ ప్రారంభించాలి. స్థలం, భవనం అద్దెకు కూడా తీసుకోవచ్చు. పరిశ్రమ ప్రారంభించిన ఆరు నెలల్లో సబ్సిడీకి దరఖాస్తు చేయాలి. అనంతరం జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారి పరిశీలించి వెరిఫికేషన్ కమిటీలో పెడతారు. కమర్షియల్ ట్యాక్స్, బ్యాంక్, ఫైనాన్స్ కార్పొరేషన్, రిజిస్ట్రేషన్, విద్యుత్ అధికారులతో ఉండే ఈ కమిటీ స్క్రూటినీ చేసి అన్నీ సరిగా ఉంటే సబ్సిడీకి సిఫార్సు చేస్తారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా ఉండే డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ అండ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ దీన్ని పరిశీలించి అన్ని అర్హతలుంటే సబ్సిడీ మంజూరు చేస్తారు.

ప్రశ్న: ఉత్పత్తి లేదా సర్వీస్ కాకుండా ఇంకా ఏ ఏ వాటికి జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా సబ్సిడీ అందిస్తున్నారు?

వైఎస్ఆర్ జగనన్న బడుగు వికాస్ పథకం ద్వారా ఎస్‌సి, ఎస్‌టిలకు వాహనాలు, జెసిబి, ఫంక్షన్ హాల్స్‌కు సబ్సిడీలు ఇవ్వడం జరుగుతుంది. కొత్తగా డెయిరీ ఫార్మ్, పౌల్ట్రీ ఫార్మ్‌లకు కూడా ఇవ్వడం జరుగుతుంది. ఇందులో ఉత్పత్తి రంగానికి రూ.50 లక్షల వరకు, సర్వీస్ సెక్టార్‌కు రూ.20 లక్షల వరకు లోన్ ఇవ్వటం జరుగుతుంది.

ప్రశ్న: ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఏఏ రంగాల్లో ఎక్కువగా మార్కెటింగ్ అవకాశాలు ఉన్నాయి?

ఫ్లై యాష్ బ్రిక్స్ తయారీ, మెడికల్ డయోగ్నస్టిక్ సర్వీస్, రెడీమేడ్ గార్మెంట్స్ తయారీ, ఫ్లోర్ మిల్, దాల్ మిల్, గిఫ్ట్ ఐటమ్స్ తయారీ, డిజె సౌండ్ సిస్టమ్, వీడియో అండ్ ఫొటోగ్రఫీ, కేబుల్ టివి నెట్‌వర్క్, ఆటోమొబైల్ సర్వీసింగ్, ఇంటర్ లాకింగ్ బ్రిక్స్, కొబ్బరి పీచు ఉత్పత్తులు, జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్, పౌల్ట్రీ, డెయిరీ ఉత్పత్తులు, వాహనాల ద్వారా ప్రయాణికుల రవాణా మొదలగునవి లాభదాయకంగా ఉంటాయి.

ప్రశ్న: ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకంలో అర్హత లేని యూనిట్లు ఏంటి?

అన్ని రకాల మాంసం ప్రాసెసింగ్ యూనిట్లు, బీడీ, పాన్, గుట్కా, సిగరెట్ లాంటి మత్తు పదార్థాల తయారీ లేక అమ్మకంతో కూడిన యూనిట్లు, వ్యవసాయం, వ్యవసాయ అనుబంధాల యూనిట్లు, పర్యావరణానికి హాని కలిగించే అన్ని రకాల ప్లాస్టిక్ వస్తువుల తయారీ యూనిట్లు, పాలిథిన్ సంచులు, రీసైకిల్ చేయబడిన ప్లాస్టిక్‌తో తయారుచేసిన క్యారీ బ్యాగులు, కంటైనర్లు తయారు చేసే యూనిట్లకు జిల్లా పరిశ్రమల కేంద్రంలో అనుమతులు మంజూరు దొరకదు.

ప్రశ్న: చివరిగా యువతకు మీరిచ్చే సలహా ఏంటి?

ప్రభుత్వ ఉద్యోగాల కోసం యువత ఎదురు చూడకుండా జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా ఇచ్చే సబ్సిడీని ఉపయోగించుకుని యువత పెద్దఎత్తున పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలి. తద్వారా ఎవరైతే పరిశ్రమలు స్థాపిస్తారో వారు ఆర్థికంగా అభివృద్ధి చెందటం మాత్రమే కాకుండా మరి కొంతమందికి ఉపాధి చూపించొచ్చు. తద్వారా దేశ ఆర్థిక ప్రగతికి, యువత అభివృద్ధికి దోహదపడవచ్చు. కాబట్టి ఉపాధి కల్పనలో ప్రభుత్వం అందిస్తున్న అన్ని పథకాలను యువత వినియోగించుకోవాలని కోరుతున్నాను.



గుంతలను పూడ్పిస్తున్న సర్పంచి

రోడ్డు వేయిస్తాం : సర్పంచి

ప్రజాశక్తి - చింతలపూడి

మేడిశెట్టివారిగూడెంలో రోడ్డు గుంతలు పడి ప్రజలందరూ ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యను స్థానిక ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లి, రోడ్డు వేయిస్తామని చింతంపల్లి సర్పంచి తాండ్ర రామకృష్ణ తెలిపారు. చింతలపూడి మండలం మేడిశెట్టివారిగూడెంలో గుంతలలో ద్విచక్రవాహనం అదుపు తప్పి తల్లికొడుకులకు ప్రమాదమేర్పడడంతో గాయాలతో సత్తుపల్లి హస్పటల్‌కి స్థానికులు తరలించారు. దీంతో సర్పంచి స్పందించి తాత్కాలికంగా స్థానికులతో కలసి గ్రావెల్‌తో గుంతలను పూడ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్అండ్‌బి అధికారులకు గుంతలు పూడ్చాలని ఎన్నిస్లారు చెప్పినా గుంతలు పూడ్చుటం లేదని ఆరోపించారు. గుంతలు పడి రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, గుంతలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయం ఎంఎల్ఎ దృష్టికి తీసుకువెళ్లి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేశారు.

ఆర్‌టిసి ఉద్యోగికి ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ సన్మానం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణానికి చెందిన ఆర్‌టిసి ఉద్యోగి కృష్ణ ప్రసాద్‌ను ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ రాజాబాబు ఘనంగా సన్మానించి ప్రశంసించటం పట్ల పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు. విజయవాడలోని సిద్ధార్ధ ఆడిటోరియంలో ఆదివారం 'నేత్రదానంపై అవగాహన సదస్సును' నిర్వహించారు. అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకు కృష్ణ ప్రసాద్‌ను ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ రాజాబాబు సన్మానించారు.

స్మార్ట్ టౌన్‌షిప్ దరఖాస్తుల గడువు పెంపు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని మ్యాంగో గార్డెన్ రీసెర్చ్ సెంటర్ సమీపంలోని 40.78 ఎకరాల విస్తీర్ణంలో స్మార్ట్ టౌన్ షిప్ ఏర్పాటు చేసినట్లు ఎపిసిఆర్‌డిఎ తెలిపింది. ఈ ప్లాట్లకు కొనుగోలుదారుల నుంచి మంచి స్పందన లభిస్తున్నందున కొనుగోలుకై దరఖాస్తు గడువును ఈనెల 30వ తేదీ వరకూ పొడిగించామని సిఆర్‌డిఎ కమిషనర్ వివేక్ యాదవ్ తెలిపారు. ప్లాట్ల కొనుగోలు విషయంలో ప్రభుత్వ ఉద్యోగులకు 20 శాతం రాయితీతో ఇస్తున్నామన్నారు. వివరాలకు సిఆర్‌డిఎ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

'విద్యుత్ ఛార్జీల పెంపుపైనే వైసిపి శ్రద్ధ'

ప్రజాశక్తి - కలిదిండి

రాష్ట్ర ప్రభుత్వానికి విద్యుత్ ఛార్జీల పెంపుపై ఉన్న శ్రద్ధ సరఫరాపై లేదని టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి అంగ్రాజు శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని మట్టగుంటలో ఆయన మాట్లాడుతూ అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ముఖ్యంగా రాత్రివేళ కరెంట్ కోతలతో వృద్ధులు, చిన్నారుల బాధలు వర్ణనాతీతమన్నారు. మరోవైపు సన్న, చిన్నకారు ఆక్వా రైతులు చెరువుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి దాపరించిందన్నారు. చెరువులలో ఏర్పాటు చేసిన ఏరియేటర్స్ పనిచేయక పోతే రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు తీస్తారో తెలియక దిక్కు తోచని స్థితిలో ప్రజలు, ఆక్వా రైతులు ఉన్నారన్నారు. నాన్ ఆక్వా జోన్ పేరుతో ఆక్వా రైతులకు అధిక విద్యుత్ వడ్డన తప్పడం లేదన్నారు. తీరు మార్చుకోకుంటే రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులు బళ్లా రాజు, ఉపసర్పంచి కోకా ఉమామహేశ్వర ధర్మారావు, నాయకులు బొడ్డు వెంకటేశ్వరరావు, కొపనాతి రాము, పొన్నాల సుబ్రమణ్యం పాల్గొన్నారు.

వాలంటీర్ ఔదార్యం

పోలవరం : అనారోగ్యంతో ఎక్కడో దూర ప్రాంతంలో చికిత్స పొందుతున్న వృద్ధురాలి వద్దకు ఆదివారం వెళ్లి, పింఛన్ అందజేసి తన ఔదార్యాన్ని, మానవత్వాన్ని, ఉద్యోగం పట్ల అంకిత భావాన్ని చాటుకున్నాడు పోలవరం మండలం ఎల్ఎన్‌డి పేట గ్రామ సచివాలయ వాలంటీర్ కె.మోహన్. వివరాల్లోకి వెళ్తే ఎల్ఎన్‌డి పేటకు చెందిన బొంగు గంగమ్మ తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో కొంతకాలం చికిత్స పొంది, ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా సింగవరంలో తన కూతురి ఇంటి వద్ద ఉంటూ చికిత్స పొందుతుంది. విషయం తెలుసుకున్న వాలంటీర్ గోదావరి దాటి వెళ్లి వృద్ధురాలికి పింఛన్ అందించారు. వృత్తి పట్ల అంకితభావంతో పనిచేసిన మోహన్‌ని పలువురు అభినందించారు.

నేరాలు - ఘోరాలు

బైకులు ఢీకొని ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు మండలం బోరవంత గ్రామ సచివాలయం సమీపంలో ఆదివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. సగ్గురు గ్రామానికి చెందిన పార్థసారథి, కల్లూరు గ్రామానికి చెందిన కోట వంశీ, జంగం గూడెం గ్రామానికి చెందిన షేక్ కాసిం ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొని గాయపడ్డారు. సమీపంలోని వారు 108 అంబులెన్స్‌లో నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ట్రాక్టర్

ప్రజాశక్తి - ముసునూరు

'అతివేగం ప్రమాదకరం' అనే చందంగా విద్యుత్ స్తంభాన్ని ట్రాక్టర్ ఢీ కొట్టింది. ఆదివారం మండల కేంద్రమైన ముసునూరు రైస్‌మిల్ సెంటర్ ఏరియాలో లక్ష్మీనరసింహ టెంపుల్ వద్ద ముసునూరు, ఏలూరు ప్రధాన రహదారిపై ఉన్న విద్యుత్తు స్తంభాన్ని అతివేగంగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టడంతో, విద్యుత్ స్తంభం పాక్షికంగా దెబ్బతింది. ఆ సమయంలో గ్రామస్తులు ఎవరూ లేకపోవడం, వాహనాలు పెద్దగా తిరగకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు.

పేకాటాడుతున్న ఆరుగురు అరెస్టు

భీమడోలు : మండల పరిధిలో ఆదివారం రెండు వేర్వేరు సంఘటనలలో కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ చావా సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గుండుగొలను శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై భీమడోలు పోలీసులు దాడి నిర్వహించి పేకాట ఆడుతున్న ఆరుగురుని అదుపులోనికి తీసుకున్నారు. వారి నుంచి రూ.4,550 నగదు, రెండు మోటార్ సైకిళ్లతో పాటు పేకాటకు చెందిన పేక ముక్కలను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

భీమడోలు : దుద్దేపూడి గ్రామపంచాయతీ పరిధిలోని అన్నే వారి గూడెం గ్రామంలో తన ఇంటికి ఎదురుగా ఉన్న వివాహితతో అసభ్యంగా ప్రవర్తిస్తూ, తన కోర్కెను తీర్చకపోతే చంపుతానని బెదిరిస్తున్న ఆరోపణపై పెమ్మి కొండ అనే వ్యక్తిపై బాధితురాలైన వివాహిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

భీమడోలు : జాతీయ రహదారిపై గుండుగొలను ఫ్లై ఓవర్ వద్ద ఆదివారం రాత్రి చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. భీమడోలు 108 వాహన సిబ్బంది తెలిపిన వివరాల మేరకు మాదేపల్లి గ్రామానికి చెందిన బొమ్మాలి రంగా మోటార్ సైకిల్‌పై ఏలూరు నుంచి కొవ్వూరు వైపు ప్రయాణం చేస్తున్నారు. గుండుగొలను ఫ్లై ఓవర్ సమీపంలో అదే వైపు ప్రయాణం చేస్తూ రోడ్డు క్రాస్ చేస్తున్న కారును ఢీకొన్నారు. ఈ సంఘటనలో మోటార్ సైకిలిస్ట్ తలకు గాయమైంది. తీవ్రంగా గాయపడిన అతనిని చికిత్స కోసం 108 వాహన సిబ్బంది సుబ్బారావు, ప్రసాద్ ఏలూరు వైద్యశాలకు తీసుకువెళ్లారు.

తాగునీటి సమస్యలు తీరేదెప్పుడో..!

ఇష్టానుసారంగా డ్రెయినేజీ నిర్మాణం - పైపులైన్లు ధ్వంసం

కాసుల ముసుగులో పట్టించుకోని సర్పంచి, కార్యదర్శి

తాగునీరు కోసం రోజుల తరబడి ఎదురు చూస్తున్న గ్రామస్తులు



ఇస్తానుసారంగా నిర్మిస్తున్న డ్రెయినేజీ..

ప్రజాశక్తి - మండవల్లి

కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి ప్రజలు తాగునీటి కష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. డ్రెయినేజీ నిర్మాణం పనులు ఇస్తానుసారంగా నిర్వహిస్తూ పైపులైన్లు ధ్వంసం చేస్తున్నారు. దీంతో ప్రజలు రోజుల తరబడి తాగు, వాడుక నీరు కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. చర్యలు తీసుకోవాల్సిన సర్పంచి, కార్యదర్శి కాసుల ముసుగులో చూసి చూడనట్లు వ్యవహరిస్తూ కాంట్రాక్టర్‌కు సహకరిస్తున్నారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. దీంతో మండవల్లి ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రహదారి విస్తరణలో భాగంగా మండల కేంద్రమైన మండవల్లిలో జాతీయ రహదారి వెంబడి డ్రెయినేజీ నిర్మాణం పనులు చేపట్టారు. డ్రెయినేజీ నిర్మాణం పనులలో ఇబ్బందులు తలెత్తితే చూసి చూడనట్లు వ్యవహరించాలని ఎన్‌హెచ్ అధికారులతో మరో మధ్యవర్తి సాయంతో సర్పంచి, కార్యదర్శి కొంత పైకానికి కాంట్రాక్టర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. దీంతో కాంట్రాక్టర్ తాగునీటి పైప్ లైన్‌లు ధ్వంసం చేస్తూ.. డ్రెయినేజీ నిర్మాణ పనులను చేపట్టాడు. అయినప్పటికీ కాంట్రాక్టర్‌ని ప్రశ్నించడానికి ఏఒక్క అధికారి ముందుకు రాలేదని ప్రజలు స్పష్టం చేస్తున్నారు. దీంతో గ్రామ ప్రజలకు తాగునీరు, వాడుక నీరు అందక నానా అవస్థలు పడుతున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి పైపులైన్లు ధ్వంసమై, గ్రామస్తుల దాహార్తిని తీర్చాల్సిన వేలాది లీటర్ల స్వచ్ఛమైన తాగునీరు ప్రతిరోజూ రహదారి పాలైపోతుంది. అంతేకాకుండా డ్రెయినేజీ నిర్మాణ పనులను క్రమ పద్ధతిలో కాకుండా, ముక్కలు ముక్కలుగా నిర్మించి అర్ధాంతరంగా వదిలేశారు. దీంతో మురుగు పారేందుకు అవకాశం లేకపోవడంతో మురుగునీరు రహదారి పైకి చేరి, దుర్వాసన వెదజల్లడంతో పాటు, రహదారి ధ్వంసమైంది. దీంతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు, గ్రామస్తులు గ్రామ సభల్లో, స్పందన కార్యక్రమాలలో అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అయినప్పటికీ కాంట్రాక్టర్ ఏ స్థాయిలో ముడుపులు చెల్లించారో తెలీదు కానీ ఎన్‌హెచ్ అధికారులు కానీ పంచాయతీ అధికారులు కానీ నేటి వరకూ సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేయలేదు.

సుమారు 6 నెలల తర్వాత తిరిగి ఆగస్టు 1 న స్టేషన్ రోడ్డులో మళ్లీ డ్రెయినేజీ నిర్మాణ పనులను చేపట్టి మొదటి రోజే పైపులైను ధ్వంసం చేసేశారు. దీంతో గ్రామానికి తాగునీరు అందని పరిస్థితి నెలకొంది. ఆగస్టు 1 నుంచి ఇప్పటివరకూ సుమారు 8 సార్లు పైప్ లైన్ ధ్వంసం చేసేసి, డ్రెయినేజీ నిర్మాణ పనులను చేపట్టినా, గ్రామస్తులకు తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకున్న నాథుడే లేడు..! అధికారులు ఏ విధంగా విధులు నిర్వహిస్తున్నారనేది, కాంట్రాక్టర్‌కు ఎలా సహకరిస్తున్నారు అనేది తేటతెల్లమవుతుందని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. నిర్మాణ పనులలో పైపులైన్లు ధ్వంసం అయితే వెంటనే మరమ్మతులు చేయించి నీరందించాల్సి ఉన్నప్పటికీ, కాసుల ముసుగులో అధికారులు ఎవరూ ఆ విధంగా చర్యలు చేపట్టకపోవడంతో రోజుల తరబడి ప్రజలు తాగు నీటి కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ ఇచ్చే కాసులకు కక్కుర్తి పడి ప్రజలను తాగునీటి కోసం ఇబ్బందులు పడేలా చేయడం ఎంతవరకూ సమంజసమని మండవల్లి ప్రజలు అధికారులను, సర్పంచిని ప్రశ్నిస్తున్నారు.

ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని, తాగునీటి కష్టాలను తొలగించేలా చర్యలు చేపట్టాలని, గ్రామానికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై కార్యదర్శి తోట శ్రీనివాసరావును వివరణ కోరగా డ్రెయినేజీ నిర్మాణ పనుల వల్ల పైప్ లైన్లు ధ్వంసం అవుతున్న మాట వాస్తవమేనన్నారు. కాంట్రాక్టర్‌కు ఎన్నిసార్లు చెప్పినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడన్నారు. పైప్‌లైన్‌లు ధ్వంసమై గ్రామంలోని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తేయని ఆయన తెలిపారు. గ్రామస్తులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పనులు నిర్వహించుకోవాలని, లేకుంటే డ్రెయినేజీ నిర్మాణ పనులను నిలుపుదల చేయాలని హెచ్చరించామని ఆయన తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు నాసిరకం గుడ్లు సరఫరా

బాలింతకు కుళ్లిన గుడ్లు అందజేత

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు కుళ్లిన, నాసిరకం గుడ్లను సరఫరా చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తోంది. గుడ్లు, పాలతో పాటు పోషకాలు ఉన్న ఆహారాన్ని ఇస్తోంది. గుడ్డు నుంచి పోషకాలు బాగా అందాలంటే దాని బరువు 44 గ్రాముల నుంచి 50 గ్రాములు ఉండాలని సూచించింది. ఒక ట్రేలో ఉన్న గుడ్ల బరువు దాదాపు కిలోన్నర ఉండాలి. అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం గుడ్డుపై ప్రభుత్వ లోగోతో సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేసినా, నాణ్యతా లోపంతో కుళ్లిన గుడ్లు అంగన్‌వాడీ సెంటర్లలో దర్శనం ఇస్తున్నాయి.

చింతలపూడి మండలంలో రాఘవపురంలోని ఒక అంగన్‌వాడీ సెంటర్లో బాలింతకు గుడ్లు ఇచ్చిన తరువాత ఇంటికి వెళ్లి గుడ్లు ఉడకబెట్టి, పెంకులు తీసి చూస్తే కుళ్లిన గుడ్డు చూసి అవ్వాక్కయారు. మిగతా గుడ్లు కూడా అలాగే ఉండటంతో అంగన్ వాడీ టీచర్‌కి ఫిర్యాదు చేశారు. అదే విధంగా సోషల్ మిడియాలో కూడా పోస్ట్ చేశారు. మండలంలోని కొన్ని సెంటర్లలో ఇదే పరిస్థితిలు ఉన్నాయని చెబుతున్నారు. ఉన్నతాధికారులు దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నారు.

చర్యలు తీసుకుంటాను

సిడిపిఒ మాధవి, చింతలపూడి

రాఘవపురంలో సచివాలయం పక్కన ఉన్న సెంటర్‌లో కుళ్లిన కోడిగుడ్లు వచ్చాయని మాకు తెలిసింది. దీనిపై ఆ సెంటర్‌ని పరిశీలిస్తాను. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాను.



జీలుగుమిల్లిలో కౌన్సెలింగ్ ఇస్తున్న డిఎస్‌పి

రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలి

జీలుగుమిల్లి : రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని పోలవరం డిఎస్‌పి ఎ.శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం జీలుగుమిల్లి సర్కిల్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భవిష్యత్‌లో మంచి ప్రవర్తన కలిగి వున్న వారి రౌడీషీట్లు తొలగించేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్‌పెక్టర్ బి.వెంకటేశ్వరరావు, బుట్టాయగూడెం ఎస్ఐ వెంకన్న పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : పట్టణంలో రౌడీ షీటర్లకు ఆదివారం పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నూజివీడు డిఎస్‌పి అశోక్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రశాంతమైన జీవనం గడుపుతూ, సమాజంలో గౌరవప్రదంగా జీవించాలని సూచించారు. ఏ విధమైన అల్లర్లు, తగవులకు వెళ్లినా ఉక్కుపాదం మోపుతామని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలను ఉపయోగించుకొని స్వయం సమృద్ధి సాధించాలని, తద్వారా సమాజంలో, కుటుంబంలో విలువలను, గౌరవాన్ని పొందాలని సూచించారు.

'వారి సేవలు ఆదర్శప్రాయం'

భీమడోలు : గుండుగొలను కేంద్రంగా వికలాంగుల సంక్షేమంతో పాటు, పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్న శ్రీవిఘ్నేశ్వర వికలాంగుల సేవా సమితి సేవలు ఆదర్శప్రాయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. గుండుగొలనులోని సేవాసమితి కార్యాలయంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఏలూరు శ్రీకృష్ణ హాస్పిటల్‌కి చెందిన వైద్య ప్రముఖులు వైద్య సేవలను అందించి, వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ నేపథ్యంలో హాస్పటల్‌కు చెందిన వైద్యులు డాక్టర్ బి.కృష్ణ, డాక్టర్ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ ప్రసాద్ రెడ్డి సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు, స్థానిక దాతలు, ప్రముఖులు దాట్ల రామకృష్ణంరాజు, వగ్వాల శ్రీరామచంద్రమూర్తి, పేరిచర్ల శ్యామల రాజు వైద్యులను సత్కరించారు.

అటవీ వన సంరక్షణ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

ఎపి గిరిజన సంఘం, రైతు కూలీ సంఘం డిమాండ్

12, 13 తేదీల్లో విశాఖలో జాతీయ సదస్సు



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు..

ప్రజాశక్తి - పోలవరం

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన అటవీ వన సంరక్షణ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని ఎపి గిరిజన సంఘం, రైతు కూలీ సంఘం డిమాండ్ చేశాయి. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తెచ్చిన 2023 అటవీ సంరక్షణ సవరణ చట్టం రద్దు చేయాలని ఏజెన్సీ గిరిజన సంఘం, రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోలవరం మండలంలోని వెంకటరెడ్డి గూడెం గ్రామంలో ఏజెన్సీ గిరిజన సంఘ కార్యాలయంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు మాట్లాడుతూ పాలకులు అడవుల నుంచి ఆదివాసీలను గెంటేయడానికి అనేక కుట్రలను పన్నుతున్నారని, అందులో భాగమే 2023 అటవీ సంరక్షణ సవరణ చట్టమని తెలిపారు. గత నెల పార్లమెంటు సమావేశాల్లో ఈ చట్టాన్ని పాస్ చేశారని, ఈ చట్టం వల్ల దేశంలోని అడవులను, కొండల్లోని ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు, విదేశీ సామ్రాజ్యవాదులకు అప్పజెప్పడానికి పాలకులు పూనుకున్నారన్నారు. దీంతో లక్షలాది మంది ఆదివాసీలు నిరాశ్రయులవుతారని, జీవ వైవిద్యం నాశనమవడంతో పాటు వాతావరణ కాలుష్యం పెరిగిపోతుందన్నారు. వర్షాలు పడక పంటలు పండని దుర్భిక్ష పరిస్థితి దేశంలో ఏర్పడుతుందన్నారు.

తక్షణమే 2023 అటవీ సంరక్షణ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని ఏజెన్సీ గిరిజన సంఘం, రైతు కూలీ సంఘం సెప్టెంబరు 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఆ సదస్సులో ఆదివాసీలు, ప్రజాతంత్ర వాదులు, మేధావులందరూ పాల్గొవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి షేక్ బాషా, ఏజన్సీ గిరిజన సంఘం నాయకులు మిడియం పోశీరావు, మిడియం రవిదొర, కలుం వెంకటేశ్వరరావు, కొమరం రామారావు, గంగాదేవి, మడకం పోసమ్మ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి

సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - ఏలూరు

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని వినియోగదారుల ప్రతినిధుల సమావేశంలో వక్తలు పిలుపునిచ్చారు. ఏలూరు అశోక్ నగర్ ద్వారక గార్డెన్స్‌లో ఆదివారం వినియోగదారుల సంఘాల ప్రతినిధుల సమావేశం విద్యావేత్త, వినియోగదారుల ఉద్యమ నాయకులు జంగా గోపాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏలూరు తహశీల్దార్ బి.సోమశేఖర్ హాజరై జంగా గోపాల్ వినియోగదారుల ఉద్యమానికి చేసిన కృషిని గుర్తు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల ఉద్యమంలో పాలుపంచుకుంటూ, విద్యా రంగంలో కృషి చేస్తున్న జంగా గోపాల్ అభినందనీయులని, ఈతరం యువతకు ఆదర్శనీయుడని కొనియాడారు. మరో ముఖ్యవక్త ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల పరిరక్షణకై సంఘాలు మరింతగా పనిచేయాలని, ప్రస్తుతం వినియోగదారుల ఉద్యమం బలహీనంగా ఉందన్నారు. మండలాలు, గ్రామాల్లో వినియోగదారుల సంఘాల నిర్మాణం జరగాలని తెలియజేశారు. కొవ్వలి వినియోగదారుల సేవా మండలి అధ్యక్షులు, న్యాయవాది కట్టా సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలు విడిపోయిన తర్వాత ప్రస్తుతం వినియోగదారుల ఉద్యమం ఉమ్మడి జిల్లాలలో బలహీనంగా ఉందని, వినియోగదారుల హక్కులను పరిరక్షించే విధంగా ఉద్యమం మరింతగా ముందుకు సాగేందుకు కృషి చేయాలని సూచించారు. వినియోగదారుల చట్టం-2019పై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలియజేశారు. విద్యావేత్త, వినియోగదారుల ఉద్యమ నేత జంగా గోపాల్ వినియోగదారుల ఉద్యమానికి చేసిన సేవను గుర్తించి ప్రతినిధులు శాలువాతో, పుష్పమాలతో ఘనంగా సన్మానించి, మెమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో తణుకు వినియోగదారుల సంఘం అధ్యక్షులు, వినియోగదారుల ఉద్యమ నాయకులు జిఎన్ఆర్ శంకర్, చింతలపూడి వినియోగదారుల సంఘం అధ్యక్షులు మొహిద్దిన్, ఎల్డర్స్ హెల్ప్ లైన్ కో-ఆర్డినేటర్ పుష్పాంజలి, జంగా గోపాలరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పలు పరిశ్రమలకు విద్యుత్ సరఫరా నియంత్రణ

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్ గ్రిడ్ ప్రస్తుతం క్లిష్టతరమైన విద్యుత్ సరఫరా పరిస్థితిని ఎదుర్కొంటుందని ఎపిఇపిడి సియల్, ఏలూరు ఆపరేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీరు సాల్మన్ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధిక స్థాయి విద్యుత్ గ్రిడ్ డిమాండ్ కారణంగా ప్రతికూల వాతావరణ పరిస్థితులు, నిబద్ధత గల మూలాల నుంచి విద్యుత్ సరఫరా తగ్గుదల ఈ పరిస్థితి నెలకొందన్నారు. తప్పని పరిస్థితుల్లో విద్యుత్ సరఫరాపై కొన్ని పరిమితులను విధించేందుకు ఆంధ్ర ప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమీషన్ పరిమితి, నియంత్రణ చర్యలను విద్యుత్ చట్టం, 2003 సెక్షన్ 23 క్రింద పరిశ్రమలకు ఆమోదిస్తూ, ఉత్తర్వులను సెప్టెంబర్ 2వ తేదీన విడుదల చేసింది.

ఎపిఇపిడిసియల్ ఆగస్ట్ 2023 నెల వరకూ ఎటువంటి అవాంతరాలు లేకుండా విద్యుత్ సరఫరా పరిస్థితిని కొనసాగించడానికి సాధ్యమైనంత ఉత్తమమైన ప్రయత్నం చేసిందన్నారు. కానీ సెప్టెంబర్‌లో తక్కువ విద్యుత్ సరఫరా లభ్యత, పెరుగుతున్న గ్రిడ్ డిమాండ్ కారణంగా, ఎపిఇపిడిసియల్‌కి వేరే మార్గం లేక 2023 సెప్టెంబర్ 5 నుంచి సెప్టెంబర్ 15, 2023 వరకూ నిర్దిష్ట పరిమితి, నియంత్రణ ఆర్ అండ్ సి చర్యలను విధించడం మినహా, పారిశ్రామిక వినియోగదారులపై రౌండ్ ది క్లాక్ ప్రాతిపదికన పరిమితి, నియంత్రణ ఆర్ అండ్ సి చర్యలను ప్రతిపాదించిందన్నారు.

విద్యుత్ సరఫరా, డిమాండ్ స్థితి, డిస్కమ్ ద్వారా ప్రతిరోజు ఎక్స్ఛేంజీల నుంచి విద్యుత్ కొనుగోళ్ల పరిమాణం, ప్రస్తుత మారకపు ధరలను కమిషన్ జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత, అనుమతించడం తప్పనిసరని అభిప్రాయపడిందన్నారు. గ్రిడ్ వైఫల్యాల నుంచి రక్షించడానికి, వినియోగదారులకు సరఫరా నాణ్యతను నిర్వహించడానికి పారిశ్రామిక వినియోగదారులచే విద్యుత్ వినియోగంపై పరిమితి, నియంత్రణ విధించాలని నిర్ణయించిందన్నారు.

నిరంతరాయంగా నడిచే పరిశ్రమలు..

ఈ పరిశ్రమలకు సంబంధించిన విద్యుత్ సర్వీసుకు నిర్దేశింపబడిన లోడు ప్రతిరోజూ 24 గంటల్లో 30 శాతం తగ్గించుకొని వాడుకొనవలెనన్నారు.

నిరంతరం కాని పరిశ్రమలు..

ఈ పరిశ్రమలు ప్రతిరోజు పగటిపూట ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల మధ్య (మొత్తం 8 గంటలు) ఒకే షిఫ్టులో విద్యుత్‌ను వాడు కొనవచ్చును. సాయంత్రం 6 గంటల తరువాత విద్యుత్‌ను వాడకూడదన్నారు.

వారంలో ఒక రోజును విద్యుత్ సెలవు దినంగా(పవర్ హాలీడే) ప్రకటించవలెనన్నారు.

పరిమితి, నియంత్రణ చర్యల నుంచి మినహాయించబడిన పరిశ్రమలు..

డ్రగ్స్ పరిశ్రమలు, ఫార్మాస్యూటికల్స్ పరిశ్రమలు, వైద్యం కొరకు ఆక్సిజన్ సరఫరా చేసే పరిశ్రమలు, రైస్ మిల్లింగ్ యూనిట్లు..

పైన పేర్కొన్న పరిమితి, నియంత్రణ విధానాలు సెప్టెంబర్ 5 నుంచి 15వ తేదీ వరకూ అమలులో ఉండునన్నారు.

పైన పేర్కొన్న విధానాలను అనుసరించని పరిశ్రమలు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలిచే నిర్దేశించబడిన ప్రకారం అపరాధ రుసుం విధించబడునన్నారు.

గృహ, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు ఏవిధమైన విద్యుత్ అంతరాయం కలిగించబడదు.

కావున పరిశ్రమల విద్యుత్ వినియోగదారులందరూ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థకు సహకరించాల్సిందిగా కోరడమైనదని ఆ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

మద్దిలో సినీ హీరోయిన్ సహర్ కృష్ణన్ సందడి



ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి దేవస్థానంలో సినీ హీరోయిన్ సహర్ కృష్ణన్ సందడి చేశారు. ఆదివారం ఆలయాన్ని సందర్శించిన ఆమెకు ఆలయ సిబ్బంది ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సహర్ కృష్ణన్ 2018 మిస్ ఆంధ్ర, శ్రీదేవి డ్రామా కంపెనీ, అంతులేని కథ, ఊరి చివర వంటి చిత్రాల్లో హీరోయిన్‌గా నటించారని తెలిపారు. ఈ క్రమంలో ఆలయానికి వచ్చిన పలువురు యాత్రికులు హీరోయిన్‌తో సెల్ఫీలు దిగారు.

పలు గ్రామాల్లో గంగానమ్మ జాతర

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం గంగానమ్మ జాతరలు ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవత గంగానమ్మను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. మండలంలోని ముదినేపల్లి, వడాలి, గురజ, సింగరం, పెనుమల్లి, కోడూరు, సింగరాయపాలెం, కాకరవాడ, శ్రీహరిపురం, పెదపాలపర్రు, పెయ్యేరు తదితర గ్రామాల్లో గంగానమ్మ జాతరలు నిర్వహించారు. డప్పు, వాయిద్యాలు నడుమ యువకులు నృత్యం చేస్తూ, ఊరేగింపులో పాల్గొన్నారు. పోటేళ్లను ఊరేగించి గంగానమ్మకు బలి ఇచ్చి, తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ ఊరేగింపులో పెద్ద ఎత్తున యువకులు, పిల్లలు, పెద్దలు పాల్గొన్నారు.